www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 22 ఆగస్టు 2025

మధ్యాహ్న భోజనాన్ని ప్రయివేటీకరించొద్దు

సిఐటియు ఆధ్వర్యాన ఎంఇఒకు వినతి

గణపవరం: మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వొద్దని కోరుతూ గురువారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యాన మిడ్‌డేమీల్స్ కార్మికులు స్థానిక ఎంఇఒ జి.బాలయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు మండల కన్వీనర్ ఎ.పెంటారావు మాట్లాడుతూ గత ఇరవై ఏళ్లగా విద్యార్థులకు నాణ్యమైన భోజనాలను అందిస్తున్న వారిని తొలగించి, ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వడం దారుణమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వేతనాలు చాలక పోయినా అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్న కార్మికులకు ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తుందని అన్నారు. ఎప్పటివలే మిడ్‌డేమీల్స్ కార్మికులతో వంటలు వండించే కార్యక్రమం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఇఒకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.త్రినాథ్, ఎ.ఎస్తేరు, జి.అలివేలు, టి.లక్ష్మి, కె.సత్తెమ్మ పాల్గొన్నారు.

గోదా'వర్రీ'..!

ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు

గంట గంటకూ పెరుగుతున్న వరద

ఆచంట : పడవపై కొబ్బరి కాయలు దింపుతున్న రైతులు

ప్రజాశక్తి - ఆచంట

గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. వరద ఉధృతి గంట గంటకూ పెరుగుతోంది. గోదావరి ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుండడంతో రెండు రోజుల నుంచి మళ్లీ గోదావరి వరదల్లో తొక్కుతోంది. కోడేరు రేవులో గురువారం సాయంత్రం నాటికి నాలుగు అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. వరద ఉధృతి నేపథ్యంలో మండలంలోని పెదమల్లం పంచాయతీ పరిధి అనగారలంక, పెదమల్లం లంక, కోడేరు పంచాయతీ పరిధి పల్లిపాలెం, అయోధ్యలంక పంచాయతీ పరిధి పుచ్చలలంక, అయోధ్య లంక, మర్రిమూల, పెద్దపేట గ్రామాల్లో వరద ఏ క్షణమైనా చుట్టుముట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో లంక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరో మూడు అడుగుల మేర పెరిగితే లంకలోకి వరద నీరు ప్రవహించే అవకాశం ఉంది. సి క్లాస్ లంక భూముల్లోకి నెమ్మదిగా వరద చేరుతోంది. గోదావరి వరద పడవలే ఆధారమైన లంక గ్రామాల ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. గోదావరి మధ్యలో చిన్నపాటి దీవులుగా ఉండే లంక గ్రామాలకు రహదారుల సౌకర్యం లేదు. ఆయా గ్రామాల ప్రజలు వెళ్లి రావాలంటే నాటు పడవలను ఆశ్రయించక తప్పదు. గోదావరి వరద వచ్చిందంటే ఆ ప్రాంత ప్రజల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. చుట్టూ నీళ్లలో రోజుల తరబడి గడపాల్సిన దుస్థితి లంక గ్రామ ప్రజలది.

కొబ్బరి దింపును భద్రపరుచుకుంటున్న రైతులు..

వశిష్ట గోదావరి క్రమ క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల రైతులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కొబ్బరి చెట్లకు దింపులు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొబ్బరికాయలను పడవల ద్వారా ట్రాక్టర్లో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

పెనుగొండ : పడవల నుంచి బొప్పాయి కాయలు దింపుతున్న రైతులు

అవసరమైతే లోతట్టు ప్రాంతాల నుంచి తరలింపు..

గోదావరికి వరద ఉధృతి పెరుగుతున్న దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నామని తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు. మండల పరిధిలోని వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన పునరావాస సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అధికారులందరూ లంక గ్రామాల్లో ఉండి ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

కనకాయలంక గ్రామానికి పడవపై వెళ్తున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ దాసిరాజు

పెనుగొండ : ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు గోదావరికి వరద పెరుగుతోంది. దీంతో సిద్ధాంతం వద్ద రెండు రోజులుగా పది అడుగుల మేర నీరు పెరిగింది. ఇంకా వరద పెరిగే అవకాశం ఉందని చెప్పడంతో లంకగ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల పంటలు మునిగిపోతాయేమోనని రైతులు భయపడుతున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గోదావరి ప్రవాహాన్ని పరిశీలించి పడవలపై రాకపోకలు సాగించే లంక రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. గోదావరి ఏటి గట్టు బలంగా ఉన్నాయా లేదా అని అధికారులు పరిశీలిస్తున్నారు.

నరసాపురం : నరసాపురంలో వశిష్ట గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద ఇన్, ఔట్ ఫ్లో 8.83 లక్షల క్యూసెక్కులు విడుదల చేయడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో స్థానికంగా గోదావరి నీటి మట్టం భారీగా పెరుగుతోంది. గోదావరి ఉధృతి కారణంగా నరసాపురం - సఖినేటిపల్లిలో పంటు రాకపోకలు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉభయగోదావరి జిల్లాల మధ్య ప్రయాణించేవారు చించినాడ బ్రిడ్జి మీదుగా వెళ్లాల్సి పరిస్థితి ఏర్పడింది. అయితే వంతెనకు మరమ్మతులు కారణంగా పూర్తిస్థాయిలో రాకపోకలు సాగకపోవడంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొన్నారు. పలు రేవులో స్నానాలకు అనుమతి రద్దు చేశారు.

ఆచంట : పడవలో లంక గ్రామాలకు వెళ్తున్న అధికారులు

రేవును పరిశీలించిన తహశీల్దార్

నరసాపురం - సఖినేటిపల్లి రేవులో పంటు, పడవలపై రాకపోకలు పూర్తిగా నిలిపివేసినట్లు తహశీల్దార్ ఐవివి సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన పంటురేవులో గోదావరి ఉధృతిని పరిశీలించి మాట్లాడారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పంటు నిర్వాహకులకు నోటీసులు అందజేశామన్నారు. తిరిగి ఆదేశాలిచ్చే వరకూ పంటు రవాణా నిలిపివేయాలన్నారు. నిరంతరం రెవెన్యూ, పోలీసు, ఫైర్ శాఖల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గోదావరిలో నిలిచిన పంట్లు

కనకాయలంకలో జెసి పర్యటన

యలమంచిలి : వశిష్ట గోదావరికి పోటెత్తిన వరద ముంపు ప్రాంతాన్ని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ రెడ్డి నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పడవ ప్రయాణం చేసేటప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బోటు ప్రయాణం చేసేటప్పుడు తప్పనిసరిగా లైఫ్ జాకెట్ ధరించాలని సూచించారు. దొడ్డిపట్ల పడవల రేవు నుంచి కనకాయలంక వరకూ ప్రభుత్వ అధికార సిబ్బంది అంతా పడవలో ప్రయాణించి వరద పరిస్థితిని సమీక్షించారు. ఆయన వెంట యలమంచిలి తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాసరావు, కనకాయలంక, పెదలంక, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు,

ఆక్వా రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి.బలరాం

ప్రజాశక్తి - ఉండి

ట్రంప్ విధించిన సుంకాలతో ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిన ఆక్వా రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బి.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో రైతు సంఘం జిల్లా నాయకులు జీను ఆదినారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆక్వా రైతుల జిల్లా సదస్సులో ముఖ్య అతిథులుగా బి.బలరాం, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.కృష్ణయ్య మాట్లాడుతూ అమెరికా అధ్యక్షులు ట్రంప్ రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపించి భారత్‌లో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు భారీగా సుంకాలు విధిస్తున్నాడని విమర్శించారు. భారత్ ఎగుమతి చేసే వస్తువులపై సుమారు 60 శాతం సుంకాలు విధిస్తుంటే, మిగిలిన దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై కేవలం 15 శాతం మాత్రమే విధిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఐదు లక్షల ఎకరాల్లో ఉన్న ఆక్వా సాగును 2047 నాటికి 15 లక్షల ఎకరాలకు విస్తరించాలని పిలుపునిచ్చిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రైతు సంక్షోభంలో ఉంటే ఆక్వా రైతులకు ఇచ్చిన భరోసా శూన్యమని విమర్శించారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ ట్రంప్ తనకున్న తిక్కతో ఆక్వా ఎగుమతులపై సుంకాలతో దెబ్బ కొడుతున్నాడన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడుతూ అమెరికా సుంకాల నెపంతో ట్రేడర్లు ఎక్స్‌పోర్టర్లు ధరలను తగ్గిస్తున్నారని, దీనివల్ల రైతు మరింత ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతున్నాడన్నారు. బి.బలరాం మాట్లాడుతూ ఈక్వెడార్, మలేషియా, సింగపూర్ వంటి చిన్న దేశాలు అమెరికా విధించిన సుంకాలపై ఎదురుదాడికి దిగాయని, దెబ్బకు ట్రంప్ దిగివచ్చి సుంకాలను తగ్గించే పనిలో ఉన్నాడని, కానీ మోడీ ఇప్పటి వరకు ట్రంప్ పెంచిన సుంకాలపై ప్రశ్నించలేదని విమర్శించారు. అనంతరం ఆక్వా రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ధనికొండ శ్రీనివాస్, మంగిన శ్రీహరి, డొక్కు స్వామి, కేసన యాదగిరి, గాదిరాజు వెంకట్రాజు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న నేతలు

ఆశాలకు రూ.26 వేలు వేతనమివ్వాలి

30న తణుకులో ఆశా వర్కర్ల జిల్లా మహాసభ

ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం

నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్న ఆశా కార్యకర్తలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత సమావేశం నాయకురాలు సిహెచ్ లక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన ఆశా కార్యకర్తల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. అరకొర వేతనాలతో, పెరుగుతున్న ధరలతో ఆశా కార్యకర్తలు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఈ నెల 30వ తేదీన తణుకులో నిర్వహించనున్న ఆశా వర్కర్స్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభలో గత మూడేళ్లలో జరిగిన ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తు పోరాటాలను రూపొందించుకుంటామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు డి.జ్యోతి, ఎల్.కుమారి, పి.రాజేశ్వరి, డి.వరలక్ష్మి, ఎన్.ప్రశాంతి, ఎమ్‌డి బేగం, బి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

శ్రీ వెంకటరమణ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శ్రీ వెంకటరమణ ఛారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అలంపురంలోని శ్రీ వెంకటరమణ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత హాస్పటల్‌ను కలెక్టర్ గురువారం సందర్శించారు. హాస్పటల్ ద్వారా రోగులకు అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్లో వివిధ విభాగాలు, వైద్య పరికరాలను పరిశీలించి ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ముందుగా జాతీయ రహదారికి ఆనుకుని ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న హాస్పటల్ కోసం కొనుగోలు చేసిన నాలుగు ఎకరాల విస్తీర్ణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ వెంకటరమణ ఛారిటబుల్ ట్రస్ట్ ఇంత పెద్ద ఎత్తున ఉచిత హాస్పటల్ నిర్వహించడం చాలా గొప్ప విషయం అన్నారు. చికిత్సకు ఇక్కడికి వచ్చిన ప్రజలను చూస్తేనే ట్రస్ట్ సేవలు ఎలా ఉన్నాయో అర్థం అవుతుందన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది ప్రజలకు వివిధ సేవలందించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ట్రస్టు నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉచిత హాస్పటల్ నిర్వాహకులు కొలనువాడ పెద్ద కృష్ణంరాజు, వారి కుమారుడు కెవిరాజు, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, పెంటపాడు తహశీల్దార్ టి.రాజేశ్వరి పాల్గొన్నారు.

క్లినిక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఐద్వా నూతన జిల్లా కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఉదయ్ కుమారి, పూర్ణ

ప్రజాశక్తి - భీమవరం

మహిళల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఐద్వా నూతన జిల్లా కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో బుధవారం ఐద్వా 15వ జిల్లా మహాసభ జరిగింది. గత మూడేళ్లలో మహిళల సమస్యలపై చేసిన పోరాటాలను సమీక్షించుకొని రాబోయే మూడేళ్ల కాలంలో చేపట్టే ఉద్యమాలపై చర్చించి ప్రణాళిక రూపొందించారు. దీనిలో భాగంగా నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలిగా ఎస్.ఉదయ్ కుమారి, కార్యదర్శిగా పొగాకు పూర్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా పద్మజ, బాసిన శ్యామల, కె.నాగరత్నం, సహాయ కార్యదర్శిగా జిల్లెల్ల ప్రశాంతి, బి.యశోద, ఎం.సరోజినీ, కోశాధికారిగా ఎస్.జయప్రభ ఎన్నికయ్యారు.



ఉదయకుమారి

పూర్ణ

అంగన్‌వాడీల కన్నెర్ర

నల్ల చీరలు ధరించి నిరసనలు, మానవహారం

తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేత

ప్రజాశక్తి - భీమవరం

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, స్కేలు జీతం అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో భీమవరంలో నిరసన ధర్నా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ అంగన్వాడీలతో వెట్టి చాకిరీ చేయిస్తూ వారి సమస్యలు పరిష్కారం చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. తక్షణం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకురాలు మహాలక్ష్మి, చిన్నారి, దుర్గ, మాధవి, రాజేశ్వరి, సావిత్రి, మరియమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

తణుకు : అంగన్వాడీలకు సమ్మె కాలపు ఒప్పందాలు, కనీస వేతనం రూ.26 వేలు వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, జిల్లా శ్రామిక నాయకురాలు అడ్డగర్ల అజయ కుమారి డిమాండ్ చేశారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, అజయకుమారిమాట్లాడారు. మినీ అంగన్వాడీలను మెయిన్ సెంటర్లు మారుస్తూ జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు గుబ్బల గోపి, బళ్ల చిన వీరభద్రం, కామన మునిస్వామి, ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు బొక్కా వసంత కుమారి, మేరిపో మధుషీలా, కె.నళిని రాణి, ఎం.జ్యోతి, బందెల మాధవి పాల్గొన్నారు.

కాళ్ల : అంగన్వాడీల పట్ల పాలకుల వైఖరి సరికాదని సిఐటియు జిల్లా నాయకులు మండా సూరిబాబు, ఇర్రింకి ఏడుకొండలు విమర్శించారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా అంగన్‌వాడీలు నల్ల చీరలు ధరించి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సూరిబాబు మాట్లాడుతూ వారికి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ జి.సుందర్ సింగ్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాలు దావులూరి మార్తమ్మ, అంగన్వాడీల్లు ఏడుకొండలు పాల్గొన్నారు.

గణపవరం : స్థానిక ఐలాండ్ వద్ద అంగన్‌వాడీలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు మండల కో కన్వీనర్ బి.రామకోటి అధ్యక్షత వహించారు. మండల కన్వీనర్ ఎం.పెంటారావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి మాట్లాడారు. సిఐటియు నాయకులు కె.త్రినాథ్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు బి. జయలక్ష్మి, కె.ధనలక్ష్మి, ఎం.లక్ష్మి, మహాలక్ష్మి, పార్వతి, రత్నకుమారి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట అంగన్‌వాడీలు మానవహారం చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు దీన స్వరూపా రాణి, సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడారు. కె.ప్రసన్న, డి.వరలక్ష్మీ, గాయత్రి, వీరమ్మ, జి.సీతసుమలత, చంద్ర పాల్గొన్నారు.

ఉండి : తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అంగన్వాడీలు మాట్లాడారు. అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెంటపాడు : పెంటపాడు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జె.శ్యామలాకుమారి, కె.కనకమాలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్.అనురాధ, జి.జయలక్ష్మి, పి.మీనాకుమారి, నాగమణి,స్నేహలత పాల్గొన్నారు.

వీరవాసరం : అంగన్వాడీల పట్ల పాలకుల వైఖరి గర్హనీయమని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు విమర్శించారు. వీరవాసరం సెంటర్లో అంగన్వాడీలు నిరసన తెలిపారు. నల్ల చీరలు ధరించి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేవారు. అంగన్వాడీ నాయకులు పి.నాగరత్నం, సత్యవతి, లక్ష్మి, నిర్మల, వెంకటలక్ష్మి, ఎస్తేరురాణి, పార్వతి పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రభుత్వ అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సిఐటియు కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ డిమాండ్ చేశారు. బ్రాహ్మణ చెరువు సెంటర్లో అంగన్‌వాడీలు మానవహారం నిర్వహించారు. శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడారు. కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుల కుసంపూడి సుబ్బరాజు మాట్లాడారు. ఎం.సాయి మహాలక్ష్మి, మంగతాయారు, నేతల నాగమణి, అనూష, సరస్వతి, సూర్యప్రభ పాల్గొన్నారు.

ఆచంట : అరకొర వేతనాలతో ఎక్కువ పని చేస్తున్న అంగన్వాడీలకు ఫేస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. ఈ మేరకు అంగన్వాడీలు నల్ల చీరలు ధరించి బ్లాక్ డే కార్యక్రమం చేపట్టారు. అనంతరం రామేశ్వరస్వామి సత్రం నుంచి కచేరీ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం చేపట్టారు. గోపాలన్ మాట్లాడారు. సిఐటియు నాయకులు పి.మోహన్‌రావు, తలపూరి బుల్లబ్బాయి, బండి రంగారావు, సిఐటియు జిల్లా నాయకురాలు వైట్ల ఉషారాణి, విజయలక్ష్మి, జి.శ్రీదేవి పాల్గొన్నారు.

మొగల్తూరు: ఐసిడిఎస్‌లను బలోపేతం చేసి ప్రభుత్వ సంస్థగా గుర్తించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సాయంత్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్లో అంగన్‌వాడీలు మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జి.పెద్దింట్లు, ఎస్.సారమ్మ, ఎ.సీత, పి.ప్రియ, వి.శశికళ, ఆర్.రేఖాశాంభవి, కె.ధనలక్ష్మి, కె.శ్వేత, డి.నాగలక్ష్మి, పి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండ : అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు మండల కేంద్రంలో అంగన్వాడీలు, హెల్పర్లు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెనుమంట్ర ప్రాజెక్టు లీడర్ కానూరి తులసి మాట్లాడుతూ లబ్ధిదారులను తగ్గించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో కెయు ఎం.భవాని, పిడి.పరమేశ్వరి, కె.నాగలక్ష్మి, ఎల్.ఉషశ్రీ, అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

నరసాపురం: స్థానిక అంబేద్కర్ సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు. నాయకురాలు జి.రాజేశ్వరి, ఎ.నీలిమ, భవాని, రత్నకుమారి, ప్రేమ్‌కుమారి, విజయ, బి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఆకివీడు : అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచాలని సిఐటియు నాయకులు బొడ్డుపల్లి రాంబాబు డిమాండ్ చేశారు. పాత బస్టాండ్ సెంటర్లో అంగన్వాడీలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు, అంగన్వాడీ నాయకురాలు కృష్ణకుమారి మాట్లాడారు. ఇరానీ, సీతామహాలక్ష్మి, డి.రమాదేవి, బి.రమాదేవి, రమాకుమారి, భవాని పాల్గొన్నారు.

భీమవరంలో..

తాడేపల్లిగూడెంలో..

తణుకులో..

నరసాపురంలో..

ఆచంటలో..

ఆకివీడులో..

నేటి నుంచి సిపిఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక మెంటేవారి తోటలోని సుందరయ్య భవనంలో ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించబోయే సిపిఎం జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సిపిఎం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యకర్తలకు మరింత లోతైన అవగాహన కల్పించడం కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలపై విపరీతమైన భారాలు వేస్తున్నాయని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు, ఇంటి పన్నులు, వివిధ రకాల పన్నులు ప్రజలపై వేయడం ద్వారా పెరుగుతున్న ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం ధరలు అరికట్టాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో స్థానిక సమస్యలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేసే వరకు పోరాటాలు నిర్వహించేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు.

ఐటిఐలో మూడో విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటిఐ)లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను మూడో విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ వెబ్‌సైట్ site-iti.ap.gov.in ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ ఐవి.సత్యనారాయణ రాజు గురువారం విలేకరులకు తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ ఆచంటలో చేరదలిచిన విద్యార్థులు ప్రవేశాల కొరకు నమోదు చేసుకోవాలని ఈనెల 26వ తేదీ మంగళవారం సాయంత్రం ఐదు గంటల లోపు ప్రభుత్వ ఐటిఐ ఆచంట కాలేజీలో అందించవలెనని తెలిపారు. ఈనెల 29వ తేదీ శుక్రవారం కౌన్సెలింగ్ అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్ తీసుకుని కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9490111002ను సంప్రదించాలన్నారు. ఎలక్ట్రీషన్, ఫిట్టర్, ఆర్‌అండ్‌ఎసి మెకానిక్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్ మాన్ సివిల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సుల వ్యవధి రెండేళ్లు అని పేర్కొన్నారు. ఆచంట పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ప్రపంచ శాంతి ర్యాలీ

మానవత సంస్థ ఛైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు

ప్రజాశక్తి - భీమవరం

మానవత సంస్థ 21వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మానవత భీమవరం శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, అధ్యక్షులు చింతలపాటి వెంకట రామకృష్ణంరాజు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాంతి ర్యాలీ ఉదయం 10:30ని భీమవరం తహశీల్దార్ కార్యాలయం ఆవరణలోని క్విట్ ఇండియా స్తూపం నుండి ప్రారంభమై వెంకట్రామా టాకీస్, ప్రకాశం చౌక్, మండల పరిషత్ కార్యాలయం మీదగా తిరిగి తహశీల్దార్ కార్యాలయం వరకు సాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మానవత సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ శాంతి ర్యాలీలో ఉపాధ్యక్షులు సాగిరాజు సత్యనారాయణ రాజు, కోశాధికారి గంధి ప్రసాద్, కన్వీనర్ కార్తూరి బాబు, విద్యా విభాగ కన్వీనర్ వలివెట్ల గోపాల కృష్ణ, గౌరవ డైరెక్టర్లు ఇందుకూరి ప్రసాద రాజు, పూనా రమేష్ హాజరుకానున్నట్లు తెలిపారు.

పిల్లలకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

జిల్లా వైద్యశాఖాధికారి గీతాబాయి ఆదేశాల మేరకు గురువారం గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో పిప్పర గ్రామం, వల్లూరు సచివాలయం పరిధిలోని పిల్లలకు సికిల్ సెల్ అనీమియా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు ఓంకార్ నాద్, కిరణ్మయి మాట్లాడుతూ ఆరు నెలల నుండి 16 సంవత్సరాల వయస్సు గలవారికి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని ఎర్ర రక్తకణాలు కొడవలి ఆకారంగా మారుతుందన్నారు. వ్యాధి వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్ బాబు, వి.సత్యవతి, పద్మజ, పి.దేవిక, ఆశా ల్లీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో పండ్లు, బ్రెడ్లు అందజేత

మొగల్తూరు : చిరు, పవన్ అభిమానుల సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు కోపల్లి శ్రీనివాస్ సూచించారు. మొగల్తూరు ముద్దుబిడ్డ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా గురువారం మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని చిరు పవన్ అభిమానుల మొగల్తూరు మండల శాఖ అధ్యక్షుడు దాసరి కృష్ణాజీ ఆధ్వర్యాన ప్రజలకు పళ్లు, బ్రెడ్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం చిరంజీవి పుట్టినరోజు వేడుకలను మండలంలోని గ్రామాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో చిరు పవన్ అభిమానులు మేడిది ప్రభాకర్, పోలిశెట్టి సాంబ, బొక్క చంటి, దుసనపూడి కోటి, మైలబత్తుల రాంబాబు, గన్నాబత్తుల కుమార్, ముక్కుగిరి, లక్కు బాబీ, అభిమానులు ఉన్నారు.

ఎంఎల్‌ఎ నాయకులతో ఆలయ కమిటీ సభ్యులు

శ్రీరాజగోపాల్ స్వామి ఆలయ ఛైర్మన్‌గా శ్రీరామ్

నరసాపురం : నరసాపురం శ్రీరాజగోపాల్ స్వామి గుడి ఛైర్మన్‌గా పట్టణానికి చెందిన రామవరపు శ్రీరామ్ నియమితులయ్యారు. శ్రీరామ్ జనసేన నరసాపురం టౌన్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. పాలకవర్గ సభ్యులు ఐన్నాసి నాగమణి, జట్ల నాగేశ్వరరావు, కొమ్ము వెంకటేశ్వరరావు, అల్లూరు దుర్గా భవాని, సంసాని పద్మావతి, జక్కం దుర్గా నాగేశ్వరరావు, సింగవరపు సుబ్రమణ్యం నియమితులయ్యారు. ఆలయ ఛైర్మన్ నియమితులైన శ్రీరామ్, పాలక వర్గ సభ్యులు గురువారం విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న మరో బస్సు

విద్యార్థులకు గాయాలు

కాళ్ల : మండల కేంద్రమైన కాళ్లలో గురువారం ఆగివున్న బస్సును మరో బస్సు ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం పట్టణంలోని ఆదిత్య జూనియర్ కాలేజ్ బస్సు విద్యార్థుల కోసం రోడ్డు పక్కన ఆగివుండగా, పెన్నాడలోని శ్రీ వెస్ట్ ఇంజినీరింగ్ కాలేజీ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా భయంతో కేకలు పెట్టారు. బస్సును వెనకనుంచి ఢీకొట్టడంతో ఆ బస్సులోపాటు గుద్దిన బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. రెండు బస్సుల్లోనూ సుమారు 60 మంది బాలికలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో కొంతమంది విద్యార్థినిలకు ముఖం, చేతులపై స్వల్ప గాయాలయ్యాయి. మిగిలిన విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను ఆటోలో ఆసుపత్రికి తరలించారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లను కళాశాల యాజమాన్యాలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత యాజమాన్యాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బైక్‌లు ఢీ

ఇరువురికి తీవ్ర గాయాలు

వీరవాసరం : వీరవాసరం పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌జెండర్ల తీరు వల్ల గురువారం ఒక ప్రమాదం చోటుచేసుకుంది. వీరవాసరం నుండి బైక్‌పై కొనితివాడ వెళుతున్న యువకుడు ఆనంద్, కొనితివాడ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న వీరవాసరం వైపు బైక్‌పై వస్తున్న మరో యువకుడు నాగరాజు పంజా వద్ద సమీపంలో ఎదురుగా ఢీకొన్నారు. వీరికి తీవ్ర గాయాలు అవడంతో 108 వాహనంలో భీమవరం ఆస్పత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాద స్థలంలో కొంతమంది ట్రాన్స్ జెండర్లు అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులను డబ్బు అడుగుతూ అడ్డగించారు. ఈ క్రమంలో అటుగా వస్తున్న బాధితులు ట్రాన్స్ జెండర్లను తప్పించబోయే క్రమంలో ఎదురెదురుగా ఢీకొన్నట్లు చెబుతున్నారు. వీరవాసరం మండలంలో పలుమార్గాల్లో ట్రాన్స్ జెండర్లు, కొంతమంది వికలాంగ మహిళలు, వాహనదారులను డబ్బులు అడగటం నిత్యకృత్యంగా మారింది. వీరి వల్ల అనేకమంది వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి వారిని నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం · ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బ్రాహ్మణ చెర్వులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల బజారు

పెనుమంట్ర : మండలంలోని బ్రాహ్మణ చెర్వు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్యం అందించే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల బజారు అందర్నీ ఆకర్షిస్తుంది. మల్లిపూడి, మార్టేరు, వెలగలేరు ప్రాంతాలకు చెందిన వ్యవసాయ శాఖ ఏపిసిఎన్ఎఫ్ ఉద్యోగులు, మండల ఇన్‌ఛార్జి ఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ బజారు నిర్వహిస్తున్నారు. చిన్న స్టాల్ ఏర్పాటు చేసి తామ రెండెకరాల 70 సెంట్లలో ఎరువులు, పురుగు మందులు వేయకుండా కేవలం సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలు ఇక్కడ అమ్మకానికి పెడుతున్నారు. ఇక్కడ మొక్కల ద్వారా వంగ, బెండ, అరటి, టమాట, మామిడి, పచ్చిమిర్చి, తీగ జాతికి చెందిన బీర, ఆనప, కాకర, దొస కాయలు, తోటకూర, గోంగూర, కొత్తిమీర, బచ్చలి, పాలకూర వంటి ఆకుకూరలు ప్రతీ వారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విక్రయిస్తున్నామని కార్యకర్తలు వేండ్ర సుబ్బలక్ష్మి, పొన్నమంద శాంతి కుమారి, బి.విజయలక్ష్మి, బి.రాణి తెలిపారు. ఇక్కడ ఉన్న కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు, స్థానిక ఉద్యోగులు కొనడం వల్ల తెచ్చిన సరుకు మిగలకుండా అమ్ముడవుతుందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

నూతన ట్రస్ట్ బోర్డ్ ప్రమాణ స్వీకారం

ఆకివీడు : స్థానిక పెద్దింట్లమ్మ దేవస్థానం నూతన కార్యవర్గం(ట్రస్ట్ బోర్డ్) పదవీ ప్రమాణ స్వీకారం గురువారం నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ రాజు ఈ పదవీ ప్రమాణస్వీకారం చేయించారు. గ్రామ మాజీ సర్పంచి, టిడిపి నాయకుడు గొంట్ల గణపతి, మరో 9 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం గణపతిని ఏకగ్రీవంగా ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఛైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, జనసేన, బిజెపి అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా చూడండి : తహశీల్దార్

ఉండి : ప్రతినెల తెల్ల రేషన్ కార్డుదారులకు అందజేసే రేషన్ పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని మండల తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. గురువారం మండల తహశీల్దార్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఉప తహశీల్దార్ కూనప రాజు సూర్యనారాయణ రాజు అధ్యక్షతన నిర్వహించిన నెలవారి సమావేశంలో పాల్గొన్న కావడి నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతినెల 26వ తేదీ నుంచి నెలాఖరు వరకు 65 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్క తెల్ల రేషన్ కార్డుదారునికి రేషన్ బియ్యాన్ని వారి ఇంటి వద్దకు వెళ్లి ఇవ్వాలని, దీనిలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వం సూచించిన సమయాల్లో కచ్చితంగా వినియోగదారులకు డీలర్ అందుబాటులో ఉండి వారికి ప్రభుత్వం నుంచి అందించే సరుకులను సరఫరా చేయాలని, వీటిలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

గణేష్‌ను అభిందిస్తున్న కొవ్వలి అభిమానులు

గణేష్‌కు అభినందన

నరసాపురం : పట్టణంలోని 26వ వార్డులో గల తులసీనగరలో నివాసం ఉంటున్న డేగల గణేష్ మంగళవారం విడుదలైన పీజీ నీట్ ఎగ్జామ్‌లో ఆల్ ఇండియా 1500 ర్యాంక్ సాధించారు. గణేష్ తండ్రి డేగల రాంబాబు యలమంచిలి మండలం మేడపాడు పిహెచ్‌సిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. గురువారం డాక్టర్ డేగల గణేష్‌ని పట్టణంలోని ఆయన స్వగృహంలో పలువురు సాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు, అభిమానులు, టిడిపి నాయకులు సంకు భాస్కర్ నాయుడు, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

వీరవాసరం : రాయకుదురు హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దొంగ సముద్రంను స్కూల్ యాజమాన్యం గురువారం సన్మానించింది. ఆగష్టు 15 నాడు జిల్లా స్థాయిలో ఉత్తమ సర్వీస్ అవార్డు పొందిన సందర్భంగా ఆయనకు ఈ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావు మాట్లాడుతూ అవార్డులు మరింత బాధ్యత పెంచుతాయన్నారు. తమ స్కూల్‌కు ఉత్తమ సేవలందించిన సముద్రంకు ఈవిధంగా జిల్లా స్థాయిలో అవార్డు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాయల వీరస్వామి, ఆర్. తులసీ ప్రదీప్, వి.శేఖర్, పి.గజేంద్ర గట్కర్, యువి.సుబ్బారావు, అరుణ, లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా కార్యదర్శిగా భీమారావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిపిఐ జిల్లా కార్యదర్శిగా కోనాల భీమారావుతో పాటు తొమ్మిది మంది జిల్లా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, బొద్దాని నాగరాజు, సికిలే పుష్పకుమారి, నెక్కంటి క్రాంతికుమార్, సనపల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. 31 మందితో జిల్లా సమితి ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా తణుకులో జరిగిన సిపిఐ పశ్చిమగోదావరి జిల్లా 27వ మహాసభల తీర్మానాలను, కొత్త కార్యవర్గం పేర్లను గురువారం భీమవరం జిల్లా సిపిఐ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కోనాల భీమారావు వెల్లడించారు.

ముంపు ప్రాంతాల రైతులకు ఎండు గడ్డి వితరణ

ఆకివీడు : ప్రకృతి బీభత్సంతో మనుషులతో పాటు పశువులకు కూడా కష్టకాలం ప్రవేశించింది. కనీసం పశువులకు మేతైన ఎండు గడ్డి కూడా లేని పరిస్థితి పలుచోట్ల రైతులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని వివరించి తమ ప్రాంతంలోని పశుమేతకు రైతులకు సహకారం చేయాలంటూ వేలేరుపాడు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు మల్లంపల్లి సాయిబుచ్చారావు కోరారు. గతంలో ఈ ప్రాంతంలో పనిచేసి వెళ్లిన పరిచయాలతో ఇక్కడ రైతులకు ఆయన సమస్యను వివరించారు. ఈమేరకు ఇక్కడ రైతులు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో సంప్రదించి సిద్దాపురంలోని రైతు జంపన కృష్ణంరాజు(జెకె) తన సొంత ఎండు గడ్డిని రెండు లారీలతో వేలేరుపాడుకు గురువారం ఎగుమతి చేశారు. ఈ గడ్డిని కుక్కునూరు మండలంలోని కొమ్ముగూడెం, లచ్చగూడెం, వేలేరుపాడు మండలంలోని రేపకగుమ్ము, రుద్రమకోట, కోయిదా గ్రామాల రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ గడ్డి లారీలను టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, రైతు నాయకులు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణ రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా పతినిధులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ హక్కులు అమలు చేయాలి

వీరవాసరం : ప్రభుత్వం తొలగించిన సీనియర్ సిటిజన్ హక్కులను పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్స్ డిమాండ్ చేశారు. సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా గురువారం వీరవాసరం యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్, కాపు వనితా క్లబ్, వీరవాసరం కళాపరిషత్ సంయుక్తంగా సీనియర్ సిటిజన్స్ హక్కులపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ రాష్ట్ర నాయకులు మేళం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ప్రభుత్వ రక్షణ పొందుతూనే మరో పక్క మన హక్కులపై పోరాడాలన్నారు. గుండా రామకృష్ణ మాట్లాడారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్స్‌లను సత్కరించారు.

కృష్ణ బలిజ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా త్రిమూర్తులు ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న గంటా త్రిమూర్తులు

భీమవరం టౌన్: ఎపి కృష్ణ బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా గంటా త్రిమూర్తులు(భీమవరం టిడిపి సీనియర్ నాయకులు) విజయవాడలోని గొల్లపూడి బిసి సంక్షేమ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ అధికారి జెఎండి ఉమాదేవి ఆధ్వర్యాన గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అంకితభావంతో కష్టపడి పనిచేస్తే అందరికీ పార్టీలో ఎంతో గుర్తింపు ఉంటుందని, పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని త్రిమూర్తులు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారని, రానున్న కాలంలో ఆయన పాలన మరింత అద్భుతంగా ఉంటుందని, ప్రజలు ఎంతో ఆనందకరమైన జీవితాన్ని అనుభవిస్తారన్నారు. తనకు ఈ ఛైర్మన్ పదవి రావడానికి సిఫార్సు చేసిన తోట సీతారామలక్ష్మి, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. టిడిపి భీమవరం పట్టణ అధ్యక్షులు ముద్దుల రాము మాట్లాడుతూ సేవాతత్పరుడు పార్టీకి ఎనలేని సేవ చేసిన త్రిమూర్తులకు ఈ పదవి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం త్రిమూర్తులు అధికార పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో చల్లబోయిన గోవింద్, యలమంచిలి శ్రీను, మరపట్ల శ్యాంబాబు, కాపా అమర్ బాబు, వినాయక్, తోట వెంకటేశ్వరరావు, గొలగాని దుర్గారావు, అన్నం నాంచారయ్య, జె.రాజు, జె.దుర్గ, నేదునూరి గంగాధర్ తిలక్, మద్దుల సాయి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ

నీటమునిగిన పొలాన్ని పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

భారీ వర్షాలకు నష్టపోయిన చిన్న సన్నకారు, కౌలు రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నీటమునిగిన వరిచేలను పరిశీలించి మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాల కారణంగా వరిచేలు నీటమునిగి రైతులు నష్టపోయారన్నారు. పెనుగొండ, చెరుకువాడ ప్రాంతాల్లో సుమారు 10 ఎకరాలు మునిగి ఎందుకు పనికిరాకుండా పోయాయని తెలిపారు. గత రెండు నెలల్లో రైతులు ఎకరానికి రూ.18 వేలు పెట్టుబడి పెట్టి నష్టపోయారన్నారు. మూడు రోజులుగా రైతులు ఆయిల్ ఇంజిన్లతో తోడు కుంటున్నారని, తక్షణం అధికారులు నష్టపోయిన పంటను అంచనా వేసి ప్రభుత్వం నుండి నష్ట పరిహారం ఇచ్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతాంగానికి రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. ఎరువులు, పురుగు మందులు సబ్సిడీపై అందజేయాలని డిమాండ్ చేశారు. బాధిత రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు



మాట్లాడుతున్న హరిబాబు

భీమవరం : కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ అందించాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులిచ్చి పంటకు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలన్నారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కౌలురైతుల సంఘం జిల్లా కమిటీ సమావేశం నాయకులు కవురు శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలు పండిస్తున్న కౌలురైతులకు, పేద రైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడం దుర్మార్గమన్నారు. భూస్వాములకు, భూయజమానులకు పెట్టుబడి సాయాన్ని కౌలు రైతులు కన్నా ముందు అందించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులు, కౌలురైతుల సమస్యలపై పోరాడుతున్న కౌలురైతుల సంఘం జిల్లా మహాసభలు సెప్టెంబర్ 7, 8 తేదీల్లో పోడూరు మండలం కవిటం గ్రామంలోని పరశురామరెడ్డి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో పంటలు పండిస్తున్న రైతాంగం, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, తీర్మానాలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మహాసభకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.బలరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు, కమిటీ సభ్యులు ఇంజేటి శేఖర్, కర్రి నాగిరెడ్డి, బొంతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్

వినతిని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తాడేపల్లిగూడెం : విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని మాట ఇచ్చిన విద్యాశాఖ మంత్రి లోకేష్ హామీలు గాలి మాటలేనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ టిడిపి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని అడ్డుకోకుండా మండల విద్యాశాఖాధికారి వారికి వత్తాసు పలకడం దారుణమని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి రాగానే విద్యార్థి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నేడు విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలు రావడానికి అనుమతి లేదని సర్క్యులర్ జారీ చేయడాన్ని తప్పుపట్టారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహశీల్దార్ కాళీ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పతివాడ నాగేంద్రబాబు, జిల్లా కమిటీ సభ్యులు మణి, గణేష్, పట్టణ నాయకులు కేశవ, భాను దుర్గేష్, గౌతమ్ పాల్గొన్నారు.

నీటిని బయటకు తీసేయండి : శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - పాలకోడేరు

రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

పిలకలు కట్టే దశలో నీటి మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి వీలైనంత త్వరగా నీటిని బయటకు తీసివేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. గొరగనముడిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, డాక్టర్ గిరిజారాణి, డాక్టర్ భువనేశ్వరి గురువారం పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి ప్రాంతాలను పరిశీలించారు. దీనిలో భాగంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఎకరానికి 20 కిలోల యూరియా, 10-15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. వీరి వెంట భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకులు కెఎఎస్ ఎస్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

గరగపర్రులో రైతులకు శిక్షణ

గరగపర్రులో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఎడిఎకెఎస్ఎస్.శ్రీనివాస్, డిఆర్‌సి బాల నాగేశ్వరమ్మ, పాలకోడేరు మండల వ్యవసాయాధికారి బి.సంధ్య హాజరై రైతులకు అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల వచ్చే ఉపయోగాలను తెలియజేశారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఇలా చేయడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి రాబడి పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు చెప్పే సూచనలు, సలహాలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (HON'BLE PRL. DISTRICT JUDGE), W.G.Dt., Eluru.

MVOP.No.300/2023

Between:
Sydu Rajyalaksmi & Others ...Petitioners
And
Kakani Rambabu & 5 Others ...Respondents

పై నెంబరు గ్రంథంలో 5వ రెస్పాండెంట్ ఘంటసాల శ్రీనివాసరావు, S/o.సోమరాజు, Driver of Mini Lorry Bearing No.AP 39 UL 3738, R/o.పైడి చింతపాడు (V), Eluru (M), ఏలూరు Dt.

అను వారికి నోటీసు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట ది.02-09-2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

C.V.SURYA KRISHNA
ఏలూరు Advocate, Eluru.
తేది.21-08-2025 Cell: 8341664461

PUBLIC NOTICE
IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE, (SENIOR DIVISION), ELURU.

O.S.No.121/2024

Between:
Musunuri Kumari Lakshmi And another ...Plaintiff
And
Moravineni Sasirekha And 4 Others ...Defendants

To.
D2: Moravineni Sai Narayana,
S/o.Late Krishna Rao, R/o.D.No.28-4-17,
12th Line, Santhinagar, Eluru.

Where as, the plaintiffs have filed the suit against the defendants for declaration and consequential recovery of possession of the plaint schedule property, where as the Hon'ble Court ordered notice to you and posted the matter for your appearance. Therefore, you are called upon to appear before the Hon'ble Court on **28.08.2025 at 10.30 A.M**. and state your objections if any, else the matter will be decided in your absence.

PYDI VENKATA RAJU
Advocate, Eluru.
Cell: 9885199811

విద్యార్థులు పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి

ఉండి : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని యండగండి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బెన్నీ శామ్యూల్ అన్నారు. గురువారం మండలంలోని మహదేవపట్నం శివారు రామచంద్రపురంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా ఎంపిపి పాఠశాలలోని విద్యార్థులకు అందించే పౌష్టికాహారాన్ని ఆయన పరిశీలించారు.

బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా యావత్ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మహారాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వరంగల్ కోర్టులో...

M.V.O.P NO. 52 OF 2024

బొల్లం స్రవంతి ...వాది
మరియు
బి మోహన్ రావు మరియు ఇతరులు ...ప్రతివాదులు

పై దావా యందు వాది, ప్రతివాది నెం.1 అయిన బి మోహన్ రావు, S/o. మునియ్య, వయస్సు : మేజర్, వృత్తి : డ్రైవర్ ఆఫ్ ద క్రైమ్ వెహికిల్, నివాసం : 3-5A, పూలపల్లి పాలకొల్లు, వెస్ట్ గోదావరి జిల్లా - 534260 గారికి కోర్టు నుండి మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపించగా అవి ముట్టనందున ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన దావాలో మీరు **తేది : 10-05-2025 రోజున ఉదయం 10.30 ని॥లకు** మీరు గానీ మీ తరపున న్యాయవాది గాని గౌరవ ప్రిన్సిపల్ జిల్లా జడ్జ్, వరంగల్ కోర్టు వారి ముందు హాజరు కాగలరు. లేని యెడల పరోక్షమున కోర్టు వారి నుండి ఉత్తర్వులు జారీ చేయబడును.

// గౌరవ కోర్టు వారి ఉత్తర్వులతో //
ఆడెపు దేవేందర్, అడ్వకేట్
ఇ.నెం. 17-3-258, ఉర్సుగుట్ట దగ్గర, కరీమాబాద్, వరంగల్, సెల్ : 8897585852

IN THE COURT OF THE HONBLE I ADDL. DISTRICT JUDGE, ELURU

I.A.No.179/2025
EMC.No.1/2016

Between:
The Asst. Divisional Engineer
APEPDCL, Narasapuram, W.G.Dt., ...Petitioner
V.V.Suryanarayana & another ...Respondents

పై నంబరు పిటిషనులో R2 అయిన శ్రీ L.శ్రీనివాసరావు, S/o.సత్యనారాయణ, వయస్సు 36 సం॥లు, R/o.D.No.6-11-15, మెయిన్‌రోడ్డు, నరసాపూర్, పశ్చిమ గోదావరి జిల్లా, అను వారికి నోటీసు అమలు కొరకు **ది.19-09-2025వ** తేదీన వాయిదా ఉన్నది. సదరు వాయిదా రోజు శ్రీ మొదటి అదనపు జిల్లా కోర్టు వారి ఎదుట ఉ॥10.30 గంటలకు స్వయముగా కానీ మీ ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల వారి పరోక్షమందు పిటీషను సంగతులు తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

ఏలూరు **E.SRINIVASA BABU**
తేది.21-08-2025 Advocate, Eluru.

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) అడిషనల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S.No.23/2024

బిట్వీన్ :
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం ...వాది
అండ్
Pattisapu Rani
Bolla Subramanyam ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్సేటు:
D1: Pattisapu Rani, W/o.Srinivasa Rao, D.No.3-75, Adavipalem, Konteru Sivaru, 4th Block, Gaggiparru, W.G.Dt, Pin:534280
D2: Bolla Subramanyam, S/o.Madhava Rao, D.No.4-109, 4th Block, Adivipalem, Konteru Sivaru, Gaggiparru, W.G.Dt., Pin: 534280.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) అడిషనల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది.03-09-2025 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియ జేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపా వారి వీధి,
నరసాపురం నరసాపురం-534275, ప.గో.జిల్లా.
తేది.21-08-2025 ఫోన్: 08814-274628

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) అడిషనల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S.No.229/2021

బిట్వీన్ :
Bank of Baroda, Narsapuram Branch ...వాది
అండ్
Tirumana Narayana Murthy
Mummidivarapu Suresh ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్సేటు:
D1: Tirumana Narayana Murthy, S/o.Mulaswamy, D.No.3-16, Gaggiparru, Elamanchili Mandal, W.G.Dt.
D2: Mummidivarapu Suresh, S/o.Nageswara Rao, D.No.3-28, Gaggiparru, Elamanchili Mandal, W.G.Dt.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) అడిషనల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది.28-08-2025 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియ జేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపా వారి వీధి,
నరసాపురం నరసాపురం-534275, ప.గో.జిల్లా.
తేది.21-08-2025 ఫోన్: 08814-274628